క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ సిపాయి



కలెక్టర్‌కు పూలమొక్కను అందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి అర్బన్: జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వ ర్‌ను వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మర్యాదపూర్వకంగా కలెక్టరేట్‌లో శుక్రవారం కలిశారు. కలెక్టర్‌కు పూల మొక్కను అందించి, దుశ్శాలువాతో సత్కరించారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈఓ, జేఈఓ

తిరుపతి(అలిపిరి): నందలూరు, తాళ్లపాక ఆలయాల బ్రహ్మోత్సవాల కరపత్రాలను టీటీడీ ఈఓ జె.శ్యామలరావు, జేఈఓ వీరబ్రహ్మంతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నందలూరు సౌమ్యనాథ స్వామి, తాళ్లపాకలోని శ్రీచెన్నకేశవ స్వామి, శ్రీసిద్దేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ ప్రశాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాలకు టెండర్ల స్వీకరణ

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూరగాయలు, మటన్ మార్కెట్లకు, పార్కింగ్ స్థలాలకు సీల్డ్ టెండర్లకు ఈనె ల 13 నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ అదితిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, రామచంద్ర గుంటకట్ట కూరగాయల మార్కెట్, జంతు వధశాల, నగరంలోని పార్కింగ్ స్థలాలకు ప్రతిఏటా టెండర్లు నిర్వహిస్తామన్నారు. 2025 మార్చి 31 వరకు రుసుము వసూలు చేసుకోవడానికి సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల జూలై 16వ తేదీ వరకు టెండర్లను స్వీకరిస్తామని, తదుపరి సీల్డ్ టెండర్, బహిరంగ వేలం పద్ధతిలో ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు నగరపాలక సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చని కమిషనర్ అదితిసింగ్ తెలిపారు.

కాపు కార్పొరేషన్ చైర్మన్ కోసం వినతి



మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న బలిజసేన నేతలు

తిరుపతి కల్చరల్: కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవి రాయలసీమ బలిజలకు ఇవ్వాలని బలిజసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తిరుపతికి విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్‌ను బలిజసేన నేతలు మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి రాయలసీమ ప్రాంతంలో బలిజలకు ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుదల లేదని పేర్కొన్నారు. తమ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవి అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బలిజసేన ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సురేష్, తిరుమల అధ్యక్షుడు హరిప్రసాద్, తోట జయంతి, కృష్ణయ్య ఉన్నారు.

8న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

తిరుపతి కల్చరల్: ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన బాలాజీ కాలనీలోని ఆఫీసర్స్ క్లబ్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేఆర్.శంకర్, జయరామనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి ఎల్.లక్ష్మీనారాయణతోపాటు 45 మంది రాష్ట్ర బాధ్యులు, అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత నాలుగు మాసాల్లో సంఘం పెన్షనర్ల సమస్యలపై తీసుకున్న చర్యలను వివరించడంతోపాటు వివిధ జిల్లాల ప్రతినిధులతో పెన్షనర్ల సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలతో తీర్మానాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సంఘ సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

అడుగడుగునా చెత్త

- కమిషనర్ రోజూ పర్యటిస్తున్నా కనిపించని మార్పు
- దుర్గంధంలో వార్డులు

తిరుపతి తుడా: స్వచ్ఛ తిరుపతి చెత్తమయంగా మారింది. నగరంలో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. కాలువలు వ్యర్థాలతో నిండిపోయాయి. యూడీఎస్ మ్యాన్ హోల్ ఓవర్ ఫ్లోతో నగర వీధులు దుర్గంధంగా మారాయి. కమిషనర్ అదితి సింగ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ప్రతిరోజూ వార్డుల్లో పర్యటిస్తున్నా క్షేత్రస్థాయిలో ఫలితం కనిపించడం లేదు. అక్కడక్కడా శానిటేషన్ మెరుగుపడ్డా అనేక ప్రాంతాల్లో నగర వీధులు చెత్త కుప్పలతో నిండిపోయాయి.

దుర్గంధంలో ఆ వార్డులు

నగర శివారు ప్రాంతం, ఎగువ ప్రాంతాలు నుంచి వచ్చే మురుగుతో నిండిపోయే 3, 4 డివిజన్లలో పారిశుధ్యం పడకేసింది. గడిచిన కొన్ని రోజులుగా అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రతి వీధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఖాళీ స్థలాల్లో డంపింగ్ యార్డులను తలపించేలా చెత్తకుప్పలు పేరుకుపోయాయి. మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. లక్ష్మీపురం మీదుగా వెళ్లే పెద్ద కాలువల్లోనూ వ్యర్థాలు టన్నులకొద్దీ స్తంభించిపోయాయి. కాలువల్లోని మురుగుతోపాటు యూడీఎస్ మ్యాన్ హోల్ ఓవర్ ఫ్లో కారణంగా ఆ డివిజన్లలో వీధులు దుర్గంధంతో మునిగిపోయాయి. ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. ఆ వార్డుల నుంచి అనేక ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న పారిశుధ్యం మాత్రం మెరుగు పడడం లేదు. శానిటేషన్‌ను పర్యవేక్షించాల్సిన అధికారులు కిందిస్థాయి సిబ్బందిని మందలిస్తున్నా ఫలితం మాత్రం కల్పించడం లేదు. తమ ప్రాంతం లోతట్టు అని, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగుతో ఇబ్బంది పడుతున్నామని, పారిశుధ్యంపై ఈ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు. కాలువలు, రోడ్లపై బ్లీచింగ్ పిచికారీ చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మీపురంలో చెత్తతో నిండిన వీధి

రోజూ కమిషనర్ పర్యటన

మెరుగైన పారిశుధ్యం అమలు చేయాలని, శానిటేషన్ విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని కమిషనర్ అదితిసింగ్ ప్రతి రోజూ నగరంలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. హెల్త్ ఆఫీసర్ సైతం ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎంత జరుగుతున్నా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీల నిర్లక్ష్యం కారణంగా కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించింది. ముఖ్యంగా 3, 4 డివిజన్లలో ఈ సమస్య అధికంగా కనిపిస్తోంది. అధికారుల ఆదేశాలను సైతం కిందిస్థాయి యంత్రాంగం పాటించకపోవడంతోనే పారిశుధ్యం లోపిస్తోంది.



మురుగునీటి దుర్గంధంతో నిండిపోయిన లక్ష్మీపురంలోని ఓ రోడ్డు



లక్ష్మీపురంలోని మదర్ ల్యాండ్ స్కూల్ రోడ్డులో చెత్తకుప్ప

కలెక్టర్‌తో వైద్యాధికారుల సమావేశం

తిరుపతి తుడా: తిరుపతి జిల్లా కలెక్టర్గా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను శుక్రవారం పలువురు వైద్యాధికారులు కలిశారు. ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, మెటర్నిటీ ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ పార్థసారథిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, వైద్య అధ్యాపకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న వైద్యాధికారులు

కౌన్సిల్ దృష్టికి అభివృద్ధి అజెండా



రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: అభివృద్ధి పనులకు సంబంధించిన అజెండాను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి ఆమోదం పొందాక వాటిని వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ తెలిపారు. అధికారులతో కలిసి ఆమె శుక్రవారం 25వ డివిజన్‌లో పర్యటించారు. కర్ణాల వీధి రైల్వే అండర్ బ్రిడ్జి పరిసరాలను పరిశీలించారు. కార్పొరేటర్ నరసింహాచారి విజ్ఞప్తి మేరకు కస్తూరిబాయి సందు- పల్లి వీధి పరిసర ప్రాంతాలను కలిపేందుకు రైల్వే అండర్ బ్రిడ్జి పైన వంతెన ఏర్పాటు చేయాలని ఇటీవల విజ్ఞప్తి చేశారు. నడకకు అవసరమైన ఈ బ్రిడ్జి నిర్మాణంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఆమె ఇంజినీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. 23వ డివిజన్‌లో కర్మక్రియలకు విశాలమైన భవనం కావాలని విజ్ఞప్తి చేయడంతో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ అదితిసింగ్ మాట్లాడుతూ నగరంలో రెండు ప్రాంతాలను కలిపే రైల్వే అండర్ బ్రిడ్జిపై నిర్మించే నడకదారి వంతెన విషయాన్ని కౌన్సిల్‌లో పెడతామని చెప్పారు. ఈ ప్రాంతంలో నడకదారి వంతెన అవసరం ఉందని గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, డీఈలు మహేష్, తేజస్వి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు తగదు

- ఆరోపణలపై చర్చకు సిద్ధం
- ఎంపీపీ యుగంధర్‌రెడ్డి

భాకరాపేట: సోషల్ మీడియా ద్వారా అసత్య, అర్థ రహిత ఆరోపణలు చేయడం తగదని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ఆరోపణలకు సంబంధించి ఎప్పుడైనా మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులు చూసుకోవచ్చన్నారు. మండల పరిషత్‌కు ఆదాయం పెంచాలన్న ఉద్దేశంతోనే కార్యాలయం ముందు, వెనుక భాగంలో 8 రూములను నిర్మించామన్నారు. గత ఏడాది మే నెలలో రూములకు అద్దె కేటాయింపులు చేపట్టాలని జిల్లా పరిషత్‌కు నివేదించామని తెలిపారు. అయితే అక్కడి నుండి ఎలాంటి అనుమతులు రాక పోవడంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం అనుమతులతో అద్దె రుసుము కేటాయించి గత ఏడాది జూన్ రెండు రూములు, అక్టోబర్ నెలలో మిగిలిన రూములను అద్దెకు ఇచ్చామని తెలిపారు. డిపాజిట్ కింద ఒక్కో రూముకు రూ.30 వేలు, అద్దె రూ.3500తో ఇచ్చామని తెలిపారు. వెనుక వైపు ఉన్న గదులకు సంబంధించి డిపాజిట్ రూ.10,000, అద్దె 3 గదులకు రూ.2000, ఒక గదికి రూ.1500గా కేటాయించామన్నారు. ఇందుకు సంబందించి చెల్లింపులు చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ అకౌంట్‌లో జమ చేస్తున్నారని తెలిపారు. మండల పరిషత్‌కు రూ.21,500 ప్రతి నెల ఆదాయం వచ్చేలా చేశామన్నారు. తుడా నిధులతో కొనుగోలు చేసిన ఫర్నిచర్ కార్యాలయంలోనే ఉందని, ఈ విషయం ఎంపీపీకి సంబంధం లేదని తెలిపారు. ఆరోపణలు చేయడం కంటే అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి, సర్పంచులు శంకర్‌రెడ్డి, మనోహర్, విజయ్‌కుమార్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, దేవప్రసాద్, రామ్మూర్తి, మునిరాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్‌బీబీ అధినేత కేవీ చౌదరి

తిరుపతి తుడా: రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని ఎస్‌బీబీ మెడికేర్ మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీబీ మెడికేర్ అధినేత కేవీ చౌదరి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది మెడికేర్ సిబ్బంది, మిత్ర బృందం అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.2.60 లక్షల విరాళం



విరాళాలను అందిస్తున్న భక్తులు

చంద్రగిరి: మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ తలుపుల తయారీకి పలువురు దాతలు రూ.2.60 లక్షలను విరాళంగా అందించినట్లు మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నడింపల్లికి చెందిన చలిచీమల కోదండరామానాయుడు రూ.2,00,116, కొమ్మినేని సోమశేఖర్‌నాయుడు రూ.50,001, కొండూరు భాస్కర్‌రాజు రూ.10.116 మొత్తం రూ.2.60 లక్షలు విరాళంగా అందించినట్లు తెలిపారు.

సామాజిక సేవతోనే.. పేరం గ్రూప్స్‌కు అవార్డులు

తిరుపతి అర్బన్: సామాజిక సేవలు చేపట్టడం ద్వారానే పేరం గ్రూప్స్ అవార్డులు అందుకుంటోందని ఆ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గ్రీష్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో అగ్రగామిగా నిలుస్తూ కస్టమర్ల మన్ననలు పొందుతున్న ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ పేరం గ్రూప్‌నకు అవార్డులు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. లండన్ దేశంలో గురువారం జరిగిన సమావేశంలో యూనైటెడ్ కింగ్‌డమ్ యూనివర్సిటీ వారు బిజినెస్ 2024 ఉమన్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును పేరం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్‌గా తాను అందుకున్నట్లు వివరించారు. అలాగే హౌస్ ఆఫ్ కామర్స్ అవార్డును హాంకాంగ్ గోల్డ్‌మెడలిస్ట్ తిరుపతి ఉదయి ఇంటర్ నేషనల్ హోటల్ డైరెక్టర్ డాక్టర్ ఉదయతేజకు అందజేశారని తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగంలో కస్టమర్లకు నమ్మకంగా సేవలు అందించడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేయడంతోనే సరైన గుర్తింపు తెచ్చుకున్నట్లు తెలిపారు. దీంతోనే పలు అవార్డులు అందుకున్నామని తెలియజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని సామాజిక కార్యక్రమాలను చేపడుతామని వివరించారు.



అవార్డు అందుకుంటున్న పేరం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గ్రీష్మ

అమరరాజాలో అప్రెంటిస్ ట్రైనీ ఉద్యోగాలు

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అమరరాజా గ్రూప్‌లో అప్రెంటిస్ ట్రైనీ ఉద్యోగాలు కల్పించనున్నట్లు జిల్లా అధికారి లోకనాథం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు మండలం, పేటమిట్ట గ్రామంలోని అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. 16-25ఏళ్ల వయస్సు కలిగిన వారు, 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపికైన వారికి మొదటి మూడు నెలల వరకు ఉచిత శిక్షణ, వసతి, భోజన సదుపాయంతోపాటు రూ.7500 స్టైఫండ్ ఇస్తారని, తర్వాత రూ.11500 స్టైఫండ్ కల్పిస్తారని వివరించారు. ఆసక్తి ఉన్న వారు రిజిస్ట్రేషన్‌తోపాటు ఇతర వివరాల కోసం 81435 76866, 91775 08275 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

తిరుపతిలో మద్యం నియంత్రించాలి

తిరుపతి కల్చరల్: కూటమి ప్రభుత్వం తిరుపతిలో మద్య నియంత్రణ చేయాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ.రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం దశలవారీగా మద్య నిషేధాన్ని అమలు చేస్తామని గతంలో హామీ ఇచ్చిందని, అలాగే తిరుపతిని మద్య రహిత ప్రాంతంగా చేయాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయని పేర్కొన్నారు. తిరుపతి కొర్లగుంట బాలాజీ హాస్పిటల్‌కు ఎదురుగా ఉన్న బ్రాందీ షాపు కారణంగా అటు యాత్రికులకు, ఇటు స్థానిక ప్రజలు, విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మందుబాబులు తాగి రోడ్డుపైనే పడిపోతున్నా పోలీసులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని తెలిపారు. నగరంలో హాస్పిటల్స్, లోకల్ టెంపుల్స్, పాఠశాలల వద్దనున్న బ్రాందీ షాపులను ప్రభుత్వం వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

చంద్రప్రభపై పరాశరేశ్వరస్వామి విహారం

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి శుక్రవారం సాయంత్రం చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. ఉత్సవర్లు తిరుచ్చి వాహనంలో ధ్వజస్తంభం వద్ద కొలువుదీరాయి. ధ్వజస్తంభానికి అభిషేకాలను నిర్వహించిన అర్చకులు నందీశ్వరుని చిత్రపటమున్న వస్త్రాన్ని అధిరోహింపచేయడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 10 గంటలకు ఉత్సవర్లను స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవర్లు చంద్రప్రభ వాహనాన్ని అధిష్టించారు. సర్కారు హారతి అందుకున్న దేవరులు పురవీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఉత్సవాల్లో రెండో రోజు శనివారం సాయంత్రం సింహ వాహనం అధిష్టించి ఊరేగింపులో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



పుస్తక పఠనానికి ప్రోత్సాహం

తిరుపతి కల్చరల్: ఆర్టీసీ డ్రైవర్ వృత్తిలో ఉన్న జీఆర్ కుమార్ పుస్తక పఠనంపై చూపుతున్న అభిమానం అపూర్వమని తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు కొనియాడారు. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం జీఆర్ కుమార్‌ను కలిసి విలువైన 200 పుస్తకాలతోపాటు రూ.1000 అందజేశారు. రచయిత సంఘ నేతలు కుమార్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఆర్ కుమార్ తిరుపతి -మదనపల్లె నాన్ స్టాప్ ఏసీ బస్ డ్రైవర్‌గా పని చేస్తూ సొంత డబ్బు వెచ్చించి పుస్తకాలు కొని ప్రయాణికులకు అందుబాటులో ఉంచారని తెలిపారు. తద్వారా పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఆయన చేస్తున్న కార్యక్రమం స్ఫూర్తిదాయకమన్నారు. రచయితల సంఘం కార్యదర్శి మన్నవ గంగాధరప్రసాద్, కార్యవర్గ సభ్యుడు వాకా ప్రసాద్ పాల్గొన్నారు.



ఆర్టీసీ డ్రైవర్ జీఆర్ కుమార్‌ను అభినందిస్తున్న రచయితల సంఘం ప్రతినిధులు

అంబేడ్కరా.. క్షమించు

తిరుపతి రూరల్: గాంధీపురం పంచాయతీలో కార్యదర్శి కరుణశ్రీ వ్యవహారశైలిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవిలాల చెరువుకు ఆనుకుని ఏళ్ల తరబడి ఉన్న అంబేడ్కర్ విగ్రహ ఆస్తులను శుక్రవారం ఆమె ధ్వంసం చేయించారు. అధికార పార్టీ నేతల మెప్పు కోసం ఆమె అంబేడ్కర్ విగ్రహం ముందు ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగ్‌ను కూల్చివేశారు. విగ్రహాన్ని కూడా తొలగించేందుకు ప్రయత్నించడంతో స్థానికులు తిరగబడ్డారు. ఆక్రమణలు తొలగించకుండా అంబేడ్కర్ విగ్రహాన్ని, చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను ఎందుకు ధ్వంసం చేస్తున్నారని ఆమెతో వాగ్వాదానికి దిగారు. అసలు రోడ్డుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, చెరువు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో నాలుగేళ్లుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం, ప్రాంగణాన్ని ఎవరు చెప్పితే ధ్వంసం చేస్తున్నారని నిలదీశారు. దీంతో ఆమె వెనక్కి వెళ్లిపోయారు.

నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన

తిరుపతి క్రైమ్: నగరంలో తిరుపతి మహిళా రక్ష పోలీస్ ఆధ్వర్యంలో చైతన్య కాలేజీలోని విద్యార్థులకు నూతన చట్టాలపైన అవగాహన కల్పించారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను మార్చి నూతన చట్టాలను అమల్లోకి తీసుకొచ్చామని విద్యార్థులు వీటిపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. బాల్యం నుంచే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో రాష్ డ్రైవింగ్ చేయకూడదని, లైసెన్స్ లేకుండా నడపకూడదని సూచించారు.

అంతర పంటలకు ఇదే అదును



ప్రత్యామ్నాయ పంటగా కంది



మామిడిలో అంతరపంటగా ఉలవలు

- అంతర పంటలుగా ఉలవలు, కంది, పెసర, అనప

భాకరాపేట: జిల్లాలో అంతర పంటలు వేసుకోవడానికి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మంచి అదును అని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలైన ఉలవలు, కంది, పెసర, అనప సాగు చేసి అదనపు ఆదాయాన్ని రైతులు పొందవచ్చు. అలాగే 10-12 సంవత్సరాల వయస్సు ఉన్న మామిడి తోటల్లో కూడా సాగు చేసుకోవచ్చు. రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జిల్లాలో బీడుగా ఉన్న సాగు భూమి 30 వేల హెక్టార్లలో సాగు చేసుకోవచ్చు.

ఉలవలు

ఉలవలు సాగు చేయడానికి సెప్టెంబరు-అక్టోబరు మాసాలు అనుకూలం. బీడు భూములు, మామిడి తోటల్లో వేసుకోవచ్చు. పశువులకు మేతగాను ఉపయోగపడుతుంది.

కంది

కంది పంటను ఖరీఫ్ పంటగా జూన్ నుంచి ఆగస్టు వరకు అలాగే రబీ పంటగా సెప్టెంబరు నుంచి అక్టోబరు వరకు విత్తుకోవడానికి మంచి అదును. నీరు త్వరగా ఇంకిపోయే గరప, ఎర్రరేగడి నేలల్లో పంట వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.


పెసర

పెసర పంటను అన్ని రకాల భూముల్లో సాగు చేయవచ్చు. చౌడు నేలలు, మురుగు నీరు నిలిచే నేలలు పెసర సాగుకు పనికి రావు.

అనప

అనప పంట సాగు చేయడానికి తేలిక నేలలు, ఇసుకతో కూడిన ఎర్ర నేలలు, మురుగు నీరు నిలవని ఒండ్రు నేలలు అనుకూలం. సెప్టెంబరు మాసంలో ముందస్తు రబీ పంట గాను, అక్టోబరు మాసంలో రబీ పంటగాను సాగు చేయవచ్చు. ఏక పంటగా సాగు చేసినట్లు అయితే ఎకరాకు 4-5 కిలోలు, అంతర పంటగా సాగుచేస్తే ఎకరాకు 1-2 కిలోల విత్తనం సరిపోతుంది.

ఉపయోగాలు అనేకం



ఉలవలు, కంది, పెసర, అనప పంటలన్నీ కూడా లెగ్యూమ్ జాతికి చెందిన పప్పు ధాన్యపు పంటలు వీటికి గాలిలో ఉండే నత్రజని తీసుకొని నేలలో స్థిరీకరించడంతో భూసారం పెంపొందించుకోవడానికి దోహదపడుతాయి. పచ్చి రొట్ట ఎరువుగా పంట సాగు చేయడంతో నేల కోతకు గురికాకుండా అరికడుతుంది. పశువులు మేతగా కూడా ఉపయోగపడుతుంది. ప్రధాన పంటలలో అంతర పంటలుగా సాగు చేయడం వలన తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడులు ద్వారా అధిక నికరాదాయాన్ని పొందవచ్చు.

–డాక్టర్ ఎస్. శ్రీనివాసులు, సీనియర్ సైంటిస్టు